నియోజకవర్గ అభివృద్ధికి కృషి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డిలు

అంబర్‌పేట: నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బుధవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీకాలనీలో రూ.58 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలకు మౌళిక వసతులు కల్పించేందుకు శాశ్వత ప్రాతిపాదికన పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యానికి హబ్‌గా తెలంగాణ..

అంబర్‌పేట: ప్రజారోగ్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం తీసుకుంటున్న విప్లవాత్మక చర్యలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం అంబర్‌పేట ఓ ఫంక్షన్‌హాల్‌లో వైద్య ఆరోగ్య ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై కేసీఆర్ కిట్లు, న్యూట్రీషియన్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్యారోగ్యానికి దేశంలోనే తెలంగాణ హబ్‌గా మారిందన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను తీర్చదిద్దుతున్నామన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, ఏఎంహెచ్‌ఓ జ్యోతిబాయి, వైద్యులు హేమలత, గురుప్రసాద్, హర్షశ్రీ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

◆ మున్సిపల్ కాలనీలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పాల్గొని గర్భిణీలు, బాలింతలకు కేసీఆర్ కిట్లు, న్యూట్రీషియన్ కిట్లను అందజేశారు.

వైద్య సిబ్బందికి సన్మానం ...

నల్లకుంట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్యారోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య, ఆరోగ్యశాఖలో విశేష సేవలందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బందిని సన్మానించారు. బుధవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ కె.శంకర్, ఆర్‌ఎంఓ డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, ఫార్మసిస్టు పద్మజతో పాటు పలువురిని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శాలువాతో సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. కోవిడ్ విపత్కర సమయంలో వైద్యులు, వైద్య సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు.



వైద్యారోగ్య ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



ఫీవర్ సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

క్లుప్తంగా

మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టండి !



మ్యాన్‌హోల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: బర్కత్‌పుర భూమన్నలేన్, వెంకటరమణ థియేటర్ పక్క వీధి తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ మూతలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. బుధవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అధికారులు, సిబ్బందితో కలిసి పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ కార్తీక, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్, బీజేపీ నేతలు భీమ్‌రాజ్, వాసు, ఓంప్రకాష్, సాయి, సూరి, ఆర్.సంతోష్, సూలం రవియాదవ్, దినేష్ తదితరులున్నారు.

నాలా రిటైనింగ్ బాధితులకు న్యాయం చేయాలి



కూల్చివేతలను పరిశీలిస్తున్న అభిషేక్‌కెన్నడీ తదితరులు

చిక్కడపల్లి: నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ డిమాండ్ చేశారు. హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భాగంగా సబర్మతీనగర్‌లో జీహెచ్‌ఎంసీ బుధవారం కూల్చివేతలను చేపట్టింది. స్థానికుల ఫిర్యాదుతో పలువురు కాంగ్రెస్ నేతలు సబర్మతీనగర్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రహరీ నిర్మాణం వల్ల ఒక్క ఇటుక కూడా పోదని ఎమ్మెల్యే చెప్పారని ఇప్పుడేమో.. ఇళ్లే పోతున్నాయని బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని డీఈ ప్రవీణ్‌ను కెన్నడీ నిలదీశారు. బస్తీ నాయకులు గౌస్‌భాయ్, హఫీజ్, జనార్ధన్, సరస్వతి, సంధ్య, ఖాజాబీ, అజ్జు, గణేశ్, శ్రీరామ్, తాజ్, సఫియాబేగం, యాది పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య ఉత్సవాలకు హాజరైన స్థానిక నేతలు



అంబర్‌పేట: వైద్య, ఆరోగ్య ఉత్సవాలకు అంబర్‌పేట నుంచి పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తరలివెళ్లారు. అంబర్‌పేట నియోజకవర్గం నుంచి కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి, సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ ఎక్కాల కన్నా తదితరులు వెళ్లారు.

ఓరుగంటి ఆనంద్‌మోహన్‌కు పురస్కారం

చిక్కడపల్లి: ప్రముఖ కవి బోయి భీమన్న కుమార్తె విజయ పల్లవి ప్రథమ జయంతి త్యాగరాయగాన సభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. బుధవారం ఆమె పేరిట పురస్కారాన్ని ప్రముఖ గాయకుడు స్వరకర్త ఓరుగంటి ఆనందమోహన్‌కు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం హాజరై మాట్లాడారు. పురస్కార గ్రహీత ఆనంద మోహన్ కర్ణాటక సంగీతంలో ప్రఖ్యాతులని ఆయన ప్రశంసించారు. బోయి భీమన్న నిధి అధ్యక్షులు బోయి హైమవతి, మాజీ డీసీపీ సుంకర సత్యనారాయణ, రచయిత్రి డాక్టర్ శోభాపెరిందేవి, వంశీ రామరాజు, నటి సుమిత్ర, ఆర్.ప్రసాద్‌రావు, సులోచన, లక్ష్మీతులసి తదితరులున్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పర్యవేక్షణ

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌లో రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నాణ్యతతో నిర్మాణ పనులను చేపట్టాలని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌లను కోరారు. బీజేపీ నాయకులు గడ్డం నవీన్, స్థానిక బస్తీ వాసులు ముదిగొండ మురళీ తదితరులున్నారు.



రూ. 11 లక్షలతో తాగునీటి పైపులైన్ పనులు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: నియోజకవర్గంలో ఎన్నికలతో సంబంధం లేకుండా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బ్రహ్మాగారి దేవాలయం వీధి, ఈదమ్మ దేవాలయం వీధిలో రూ.11లక్షలతో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ సుప్రీయానవీన్‌గౌడ్, జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన పెరిగిన జనాభాకు అనుగుణంగా కొత్త పైపులైన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అవసరమైన చోట డ్రైనేజీ పైపులైన్లు వేస్తామన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ టీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌పర్సాద్, ఆకుల అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులు బల్ల ప్రశాంత్, లక్ష్మణ్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, గౌరీశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, ఎస్సీసెల్ అధ్యక్షుడు సదా, మహిళా కమిటీ అధ్యక్షురాలు శోభ, మేరి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు, ఎరువులు అందించాలి



కవాడిగూడ: రైతులందరికీ విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు తక్షణమే అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులతో పాటు పోడు సాగుదారులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, పంట నష్టపరిహారం, పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండాలన్నారు. నకిలీ ఎరువులు, విత్తనాలు సరఫరా చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎరువాక ప్రారంభమైన వ్యవసాయశాఖ ఎరువులను అందుబాటులో ఉంచకపోవడం రైతులపట్ల నిర్లక్ష్యానికి నిదర్శమన్నారు. ఎరువులపై సబ్సిడీ తగ్గింపుకై సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సాహానికి కుట్రపూరితంగా ప్రణమ్ పథకం ప్రకటించారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, రుణాలు తక్షణమే అందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టి ముట్టడిస్తామని హెచ్చరించారు.

మరమ్మతు పనుల పరిశీలన



నాలా, రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నల్లకుంట మార్కెట్ రోడ్డులో జరుగుతున్న నాలా, రోడ్డు మరమ్మతులను వారం పదిరోజుల్లో పూర్తిచేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం నల్లకుంట కూరగాయాల మార్కెట్‌లో జరుగుతున్న నాలా, రోడ్డు మరమ్మతుల పనులను ఆయన పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ.. వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. స్లాబ్‌లపై రెగ్యూలర్‌గా క్యూరింగ్ చేయాలని రోడ్డుకు ఇరువైపుల రేలింగ్, ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలన్నారు. హాజీఫెడ్ డైరెక్టర్ ఐయిలినేని కిషన్‌రావు, ఆదర్శ కాలనీ అసోసియేషన్, నల్లకుంట సీజన్స్ అసోసియేషన్ నాయకులు సత్తయ్యగౌడ్, సీపీఐ ముషీరాబాద్ కన్వీనర్ వెంకటస్వామిగౌడ్, మోహన్‌రావు, శ్రీనాథ్, మోహన్‌నాయుడు, వీరయ్య, శ్రీనివాస్‌రావు, సాగర్‌రెడ్డి, రమణ, రమేష్, జయదేవ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి

కాచిగూడ: దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం సీట్లు కేటాయించాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. గురువారం బీసీదళ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీలను గుర్తించి వారికి టికెట్లు ఇవ్వాలని బీసీలను విస్మరించిన పార్టీలకు ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రూ.2లక్షల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దేశ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. బీసీలకు పారిశ్రామిక పాలసీలో 50శాతం కోటా ఇవ్వాలని ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించాలని కోరారు.

ఆరెకటికలను ప్రభుత్వం ఆదుకోవాలి



అజ్మీర్ దర్గాకు చాదర్ సమర్పిస్తున్న కళ్యాణ్‌కార్ ఈశ్వర్ చౌదరి

కాచిగూడ: సామాజిక, రాజకీయ, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన ఆరెకటికలకు ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆరెకటిక సేవా సమితి అధ్యక్షుడు కళ్యాణ్‌కార్ ఈశ్వర్ చౌదరి ప్రభుత్వానికి విజ్ఞపి చేశారు. ఈ మేరకు బుధవారం అజ్మీర్ దర్గాకు 200 మందితో కలిసి వెళ్లి చాదర్ సమర్పించినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ కమ్యూనిటీ రిజర్వేషన్లకు నోచుకోలేక దయనీయమైన బతుకులు వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే తమ కులాన్ని ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కులస్తులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయన్నారు. జనాభా దమాషా ప్రకారం తమ కులస్తులకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో 3 స్థానాలు, ఆదిలాబాద్, కరీంనగర్‌లో ఒక్కోస్థానంలో అన్ని రాజకీయపార్టీలు టికెట్లు ఇచ్చి సముచిత న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరెకటిక సమాజానికి ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి, రూ.500 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఫీవర్ ఆసుపత్రికి వీల్‌చైర్స్ విరాళం



ఫీవర్ సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌కు వీల్‌చైర్స్ అందజేస్తున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

నల్లకుంట: సీఎం కేసీఆర్ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని బీఆర్‌ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పేద ప్రజలకు ఉచితంగా చేరువ చేసేందుకు బస్తీదవాఖానాలు ఏర్పాటు చేయించారన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్యారోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫీవర్ ఆస్పత్రికి ఐదు వీల్‌చైర్స్‌ను విరాళంగా అందజేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్, సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యసిబ్బందిని శాలువాలతో సన్మానించారు. అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ పులిజగన్, బీఆర్‌ఎస్ నగర నాయకుడు గరిగంటి రమేశ్, శిశుసంక్షేమశాఖ మాజీ ఆర్‌ఓ సుశీలరెడ్డి, సీనియర్ నాయకులు నగేశ్‌గౌడ్, మురళీ కృష్ణ, దేవిరెడ్డి విజితారెడ్డి, ఉద్యమ నాయకుడు జీవన్‌గౌడ్, బోయ వెంకటరమణ, రాము, జనార్ధన్, రాహుల్, యూసుఫ్ బాబా, ప్రకాష్‌రెడ్డి, దయానంద్, రుద్రశ్రీనివాస్ నాగమణి, దుర్గ, అండాలు, విజయలక్ష్మి, లావణ్య, సాయిపూర్ణ, మహేష్, దేవేందర్, పాండు, బాలరాజు తదితరులున్నారు.

రోగులకు పండ్ల పంపిణీ ..

నల్లకుంట: నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో వైద్య ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్, ఆర్‌ఎంఓ డాక్టర్ జయలక్ష్మితో కలిసి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ కొండల్‌రెడ్డి, డాక్టర్ యాగేందర్, డాక్టర్ రవికుమార్ టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోహన్‌దాసు, ఆఫీస్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాస్, హెడ్‌నర్స్ సునిత తదితరులున్నారు.

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరించాలి

ముషీరాబాద్: ద్విచక్ర వాహన మెకానిక్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డిజిల్లా టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. టూ వీలర్ మెకానిక్‌లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వారికి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. బ్యాటరీ వాహనాల రిపేరింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని కోరారు. హెచ్‌ఎంఆర్ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షులు జగన్‌గౌడ్, సంయుక్త కార్యదర్శి అల్వాల్ శ్రీనివాస్, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, బల్ల ప్రశాంత్, జగదీష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు వేతన సవరణలు అమలు చేయాలి

ముషీరాబాద్: ఆర్టీసీ కార్మికులకు రెండు వేతన సవరణలు (2017–21) చేయాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ (టీజేఎంయూ) ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి బస్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం బహిరంగసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.హనుమంతుముదిరాజ్ మాట్లాడుతూ.. టీఎస్ ఆర్టీసీలో సుమారు ఏడేళ్ల నుంచి ఆర్టీసీ కార్మికులకు వేతనాలు పెంచకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని గతంలో రిటైర్డ్ అయిన రోజే వారికి రావాల్సిన డబ్బులు ఇచ్చేవారని ఆ ఆనవాయితీని కొనసాగించాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, డీవీకే రావు, ముఖ్య ఉపాధ్యక్షులు కృష్ణ, జాయింట్ సెక్రటరీలు శీనయ్య, స్వాములయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్లో యువకుడి ల్యాప్‌టాప్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి ల్యాప్‌టాప్ చోరీకి గురైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా తడ గ్రామానికి చెందిన రేయాన్‌కుమార్ యెలహంక ఎక్స్‌ప్రెస్ రైల్లో కాచిగూడకు వస్తున్నాడు. కర్నూల్ స్టేషన్ వద్ద ల్యాప్‌టాప్, పలు కార్డులు ఉన్న అతడి బ్యాగు చోరీకి గురైంది. బుధవారం బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం !



గోల్నాక సీపీఎల్ రోడ్డులో ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

అంబర్‌పేట: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు ఎన్.గౌతమ్‌రావు విమర్శించారు. గత నెల రోజులుగా అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట డ్రైనేజీ సమస్యతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బుధవారం బీజేపీ గోల్నాక డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. హైదరాబాద్ నగరాన్ని ఇస్తాంబుల్, డల్లాస్ నగరాలుగా మారుస్తానని చెప్పిన సీఎం ఆ విషయాన్ని మరిచిపోయారన్నారు. బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, గోల్నాక డివిజన్ కన్వీనర్ మూల రవీందర్‌గౌడ్, నాయకులు కె.నర్సింగ్‌రావు యాదవ్, ఆర్‌కే.రాంచందర్, ఎం.సామ్రాజ్, ఆనంద్‌గౌడ్, రమేష్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

నల్లకుంట: ఐదేళ్ల చిన్నారిపై పాశవికంగా దాడిచేసి గాయపరిచి అత్యాచారానికి యత్నించిన విషయం విధితమే. ఈ ఘాతుకానికి పాల్పడిన ఆగంతకుడిని నల్లకుంట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ మొగిలిచర్ల రవి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా పీర్జాపూర్‌కు చెందిన రాజనాల రమేష్(26) 2012లో జీవనోపాధికోసం హైదరాబాద్‌కు వచ్చాడు. కాచిగూడ రైల్వేస్టేషన్ పరిసరాలలో కాళీబాటిల్స్, చిత్తు పేపర్స్ సేకరిస్తూ.. రైల్వే స్టేషన్ ఎదురుగా బస్‌స్టాపులు, ఫుట్‌పాత్‌లపై నివసిస్తుంటాడు. చెడు సాహవాసాలతో వైటనర్ సేవించడంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. అదే ప్రాంతంలో ఓ మహిళ బిక్షాటన చేస్తూ.. తన ముగ్గురు చిన్నారులతో నివాసం ఉంటోంది. ఆ యాచకురాలి పెద్ద కుమార్తె (5)మంగళవారం ఉదయం ఒంటరిగా టిఫిన్ తెచ్చుకునేందుకు బయలుదేరింది. చిన్నారిని అనుసరించిన అతడు కొద్ది దూరం వెళ్లాక చిన్నారికి మాయమాటలు చెప్పి తనతో నల్లకుంటకు తీసుకెళ్లాడు. అక్కడి నుంచి నల్లకుంట స్ట్రీట్ నంబర్-3కు తీసుకొచ్చి అక్కడ అఘాయిత్యానికి యత్నించాడు. చిన్నారి గట్టిగా అరవడంతో చిన్నారిని కిందపడేసి తలను బండరాయితో మోదాడు. చిన్నారి అరుపులు విన్న స్థానికులు రావడంతో పారిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీసీటీవీ ఫుటేజీ, ఇతర ఆధారాల ద్వారా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన వద్ద నిందితుడు రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. గురువారం రిమాండ్‌కు తరలిస్తామని సీఐ తెలిపారు.

రాష్ట్రంలో వేగంగా ఆమ్‌ఆద్మీ విస్తరణ



సుధాకర్ సమక్షంలో ఆప్‌లో చేరిన ఆటో యూనియన్ నాయకులు

కవాడిగూడ: దేశవ్యాప్తంగా ఆమ్‌ఆద్మీ పార్టీ వేగంగా విస్తరించడంతో పాటు తెలంగాణలో కూడా అద్భుతమైన పెరుగుదల కనిపిస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డు సుధాకర్ అన్నారు. అవినీతి, మతపరమైన స్వభావాలతో ప్రజల విసిగిపోయి, నిజాయితీ, ప్రత్యామ్నాయ రాజకీయాలు ఆలోచనలతో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీని ప్రజలు ప్రత్యేకంగా ఆదరిస్తున్నారు. హైదరాబాద్, లిబర్టీ ఆప్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన ఏఐటీయూసీ ఆటోరిక్షా వర్కర్స్ యూనియన్ మాజీ నాయకుడు మల్లేష్ నేతృత్వంలో పలువురు నేతలు ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు, సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం చూపాయని ప్రజలు జీర్ణించుకోలేని స్థితిలోకి నెట్టివేశాయన్నారు. ఆప్ తెలంగాణ ప్రొఫెషనల్ కమిటీ కన్వీనర్ హరిచరణ్, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ఎం.డీ.మజీద్, డాక్టర్ పాండు, రంగయ్య, నాయకులు అఫ్జల్, జావేద్, షరీఫ్, ఫణి భూషణ్, సోహెల్ తదితరులున్నారు.

క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్‌లను క్రమబద్ధీకరించాలి

కవాడిగూడ: సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా సమాన పనికి సమాన వేతనం, టైమ్ పే స్కేల్‌ను అమలు చేసి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని పీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, యాదగిరిలు డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది సమగ్ర శిక్ష ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్లు హాజరయ్యారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 2117 మంది క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్స్(సీఆర్‌పీ)లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులతో సమానంగా మహిళా సీఆర్‌పీలకు ఆరు నెలల వేతనంతో పాటు ప్రసూతి సెలవులు అమలు చేయాలని పేర్కొన్నారు. బీఎస్సీ గురుకులాల టీచర్ల నియామకంలో 30 శాతం వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగదు రహిత వైద్య సదుపాయం, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన రిసోర్స్ పర్సన్‌లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలలో పరస్పర అంగీకారంతో బదిలీలకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌ల న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సహదేవ్, కోశాధికారి రవీందర్, ప్రచార కార్యదర్శి మహేందర్, జానకీరాముడు, మహబూబ్‌పాషా, చంద్రశేఖర్, చందు, సుధాకర్ తదితరులున్నారు.

వృద్ధ మహిళలను హింసించిన వారిపై చట్టపరమైన చర్యలు



రిపోర్టును విడుదల చేస్తున్న జె.జె.శోభా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో వృద్ధ మహిళలను హింసిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రముఖ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత జె.జె.శోభా అన్నారు. దేశంలో రోజు రోజుకు వృద్ధ మహిళలు, ఒంటరి మహిళలపై హింస పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ మహిళలు ఎదుర్కొంటున్న వివక్షతపై ప్రభుత్వం దృష్టిసారించాలని కోరారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వేధింపుల నివారణకు సంబంధించిన స్థితిగతుల రిపోర్టును విడుదల చేశారు. అనంతరం జె.జె.శోభా మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వృద్ధ మహిళలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో 58 శాతం వృద్ధ మహిళలు హింసకు గురవుతున్నారని వీరిలో 40 శాతం అగౌరవం, 42 శాతం మాటల ద్వారా, 35 శాతం శారీరకంగా హింసకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 97 శాతం వృద్ధ మహిళలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన లేదన్నారు. 57 శాతం వృద్ధ మహిళలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని వారికి ప్రభుత్వమే ఆరోగ్యాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 20 శాతం మంది వృద్ధులు సామాజిక వివక్షతకు గురవుతున్నారన్నారు. న్యాయవాది అర్చన, తోడునీడ వ్యవస్థాపకులు రాజేశ్వరి, వృద్ధుల సంఘం అధ్యక్షులు కృష్ణకుమారి, జీఎంఆర్ ఫౌండేషన్ మేనేజర్ భారతీ, మహిళా మండలి అధ్యక్షురాలు సుమిత్ర, వివిధ సంస్థల ప్రతినిధులు రజనీప్రియ, శ్యామ్‌కుమార్, ఓస్టాన్లీ, హేతేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.